సాక్షి
నారాయణపేట
గురువారం । 19 । డిసెంబర్ । 2024



హైవేపై దారి దోపిడీ

ఎన్‌హెచ్‌-44పై గుర్తుతెలియని దుండగులు దారి దోపిడీకి పాల్పడ్డారు.

వివరాలు 8లో ▸



దిగి వచ్చిన ఉల్లి ధర

ఉల్లి ధర గత వారం కంటే రూ. 1,500 వరకు తగ్గింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /10.8

వాతావరణం

చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం, రాత్రివేళ మంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్‌

బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలి



మక్తల్‌: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్డు వేసేందుకు రూ.47 కోట్లు మంజూరు చేయాలని పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి సీతక్కను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కోరారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని మక్తల్‌, నర్వ, ఆత్మకూర్‌, అమరచింత, కృష్ణ, ఊట్కూర్‌, మాగనూర్‌ మండలాల్లోని చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు



మక్తల్‌: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై చర్యలు తప్పవని ట్రైనీ కలెక్టర్‌ గరీమ నరులా అన్నారు. బుధవారం పడమటి ఆంజనేయస్వామి జాతర ఆవరణలో బాలల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె బాలలకు సంబంధించిన హక్కుల గురించి వివరించారు. బాల్యవివాహాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ఆడపిల్లలు మధ్యలోనే చదువు మానివేయకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తున్నట్లు తెలిసినా, బాలికలను వేధించినా వెంటనే 1098కు ఫోన్‌ చేసి సమాచారం ఇస్తే వెంటనే స్పందించి వారిని ఆదుకుంటారన్నారు. అనంతరం పోక్సో చట్టం, బాల్య వివాహాలు, బాలికలను వేధిస్తే చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, కమిషనర్‌ బోగేశ్వర్‌తోపాటు ప్రాణేష్‌కుమార్‌, నర్సింలు, కవిత, విజయ, సుజా పాల్గొన్నారు.

రూ.1,800 కోట్ల టర్నోవరే లక్ష్యం



మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) ముగిసేలోగా వచ్చే మార్చి 31 నాటికి రూ.1,800 కోట్ల టర్నోవరే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని డీసీసీబీ చైర్మన్‌ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ సమావేశ మందిరంలో మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో గత నెల 30వ తేదీ నాటికి రూ.400 కోట్ల మేర డిపాజిట్లు సేకరించామన్నారు. ఇప్పటివరకు స్వల్పకాలిక రుణాల కింద రూ.670 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.170 కోట్ల తో పాటు ఆయా రైతులు, వినియోగదారులు ఏర్పా టు చేసుకునే వివిధ యూనిట్లకు రూ.286 కోట్ల రుణాలు అందజేశామన్నారు. ఆర్‌బీఐ అనుమతితో త్వరలోనే వినియోగదారులందరికీ మొబైల్‌ బ్యాంకింగ్‌, యూపీఐ సేవలు అందుబాటులో రానున్నాయని ఆయన వివరించారు. డీసీసీబీ ఉపాధ్యక్షుడు కోరమోని వెంకటయ్య, బ్యాంకు సీఈఓ పురుషోత్తంతో పాటు డైరెక్టర్లు, పీఏసీఎస్‌ ఎఫ్‌ఏసీఎస్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.

'సర్కారీ వైద్యంపై నమ్మకం పెంచాలి'

పాన్‌గల్‌: వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సరైన చికిత్స అందిస్తూ ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెంచాలని ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ మెడికల్‌ రీసెర్చ్‌ సెంటర్‌ చెన్నై వైద్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు డా. మొగన్‌, డా. మాలతి అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీతో పాటు అన్నారం ఉప కేంద్రాన్ని వారు సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రికార్డులు, హాజరు పట్టికలు, రక్తపోటు, మధుమేహం కేసుల స్క్రీనింగ్‌, పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అసంక్రమిత వ్యాధులు, అందుతున్న వైద్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌ తోట శ్రీధర్‌, ఎన్‌సీడీ కార్యక్రమ జిల్లా అధికారి డా. రామచంద్రారావు, జిల్లా కో–ఆర్డినేటర్‌ శ్రీనివాసులు, డబ్ల్యూహెచ్‌ఓ సీనియర్‌ ట్రీట్‌మెంట్‌ సూపర్‌వైజర్‌ రమేష్‌, పీహెచ్‌సీ వైద్యుడు డా. చంద్రశేఖర్‌, సీహెచ్‌ఓ రామయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొగమంచులో ప్రయాణం.. అప్రమత్తతే ప్రధానం

- మేఘా గాంధీ, మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌, నారాయణపేట





జిల్లాలో చలి తీవ్రత పెరగడం.. రాత్రి వేళల్లో పొగమంచు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. వాహనదారులు అప్రమత్తంగా వాహనాలు నడపాలని మోటారు వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ (ఎంవీఐ) మేఘా గాంధీ సూచించారు. పొగమంచు నేపథ్యంలో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

- చలికాలంలో వాహనాల్లో అర్ధరాత్రి తర్వాత, ఉదయం 8 గంటలలోపు దూర ప్రయాణాలు చేయకుండా ఉండడమే మంచిది. రాత్రి సమయాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో మాత్రమే ప్రయాణం చేయాలి. పొగమంచు అధికంగా కురుస్తుంటే రహదారిని చూడగలిగే పరిస్థితులకు అనుగుణంగా వేగం తగ్గించాలి. ఎదురుగా, వెనక వచ్చే వారికి స్పష్టంగా కనిపించేలా హెడ్‌లైట్లు, నాలుగు ఇండికేటర్లు వేసి ఉంచాలి. వాహనాల అద్దాలపై మంచు పొరను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలలి. వాహనాలను ఓవర్‌ టేక్‌ చేసే సమయంలో డిప్పర్‌ కొడుతూ రోడ్డు స్పష్టంగా కనిపిస్తేనే ముందుకు వెళ్లాలి. వాహనం నడిపే సమయంలో తాగడం, తినడం అస్సలు చేయకూడదు. డ్రైవింగ్‌పైనే దృష్టి సారించాలి.

- నారాయణపేట

నారుమడులపై ప్రత్యేక జాగ్రత్తలు అవసరం

- ప్రభాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్‌, కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం





కొన్ని రోజులుగా చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో వరి నార్లు, మిరపనార్లు తదితర పంటల విషయంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై నాగర్‌కర్నూల్‌ జిల్లా పాలెం కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్‌ ప్రభాకర్‌రెడ్డి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..'చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు వరి నారు మొదటి దశ నుంచే రైతులు జాగ్రత్తలు పాటించాలి. నారుమళ్లలో నిలిచిన నీటిని సాయంత్రం వేళల్లో పూర్తిగా తొలగించాలి. ఉదయం పూట మళ్లీ నారుమడిని నీటితో నింపాలి. రాత్రి వేళల్లో నారుమళ్లలో నీరు లేకుండా చూసుకుంటే చలి నుంచి రక్షణ ఉంటుంది.

- సాక్షి, నాగర్‌కర్నూల్‌

- మిర్చి నార్లు, ఇతర పంటలు ఏవైనా రసాయనిక ఎరువులను తక్కువ మోతాదులో దశల వారీగా వినియోగించాలి.
- చలి ఎక్కువ ఉండటంతో నారు జింక్‌ ధాతువును శోషించుకునే గుణం తగ్గిపోతుంది. అందువల్ల నారుకు అవసరమైన పోషకాలు అందవు. ఇందుకోసం కృత్రిమంగా జింక్‌ను స్ప్రే ద్వారా అందించాలి. వారానికి ఒకసారి చొప్పున మొత్తానికి రెండుసార్లు యూరియాతో కలిపి స్పింట్‌ను స్ప్రే చేస్తే మంచి ఫలితం ఉంటుంది. లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్‌ సల్ఫేట్‌ కలపి స్ప్రే చేయాలి.

సురక్ష బీమా.. కుటుంబానికి ధీమా



విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



ప్రధాన్‌ మంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధాన్‌ మంత్రి జీవన జ్యోతి యోజన (పీఎంజీజేబీవై)కు అర్హులైన ప్రతి ఒక్కరు పాలసీని తీసుకోవాలని ఆయా బ్యాంకుల సిబ్బంది గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నామమాత్రపు రుసుంతో పేదలు బీమా పరిధిలోకి రావచ్చు. అమలులో ఉన్న రెండు బీమా పాలసీలకు అర్హులుగా ఉంటే రెండింటిని తీసుకోవచ్చు. ఈ బీమా వల్ల పేదలకు ఆపదలో ఆర్థిక భరోసా దక్కుతుంది. ప్రత్యేక అవగాహన కార్యక్రమాలతో ఆయా బ్యాంకులు ఖాతాదారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. **- విజయ్‌కుమార్‌,** లీడ్‌ బ్యాంకు మేనేజర్‌ నారాయణపేట

పోస్టాఫీసులో సంప్రదించాలి

జీవన్‌జ్యోతి, సురక్షబీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి. ఈ **పథకాలతో తక్కువ వార్షిక ప్రీమియంతో అత్యధిక ప్రయోజనాలున్నాయి. ఆసక్తి గలవారు సమీప పోస్టాఫీసులో సంప్రదించాలి. పోస్టుమన్‌కు సమాచారం అందించినా ఈ పాలసీలను అందిస్తారు.**

- రవికుమార్‌, పోస్టల్‌ ఇన్‌స్పెక్టర్‌

- బ్యాంకులు, పోస్టాఫీస్‌ ద్వారా ప్రమాదబీమాకు అవకాశం
- పీఎం జీవన్‌ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజనతో ఆర్థిక భరోసా
- తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు
- జిల్లాలో జనవరి 15 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు



నర్వలో బాధిత కుటుంబానికి సురక్షబీమా చెక్కు అందిస్తున్న ఆర్‌ఎం, మేనేజర్‌ (ఫైల్‌)

నర్వ: దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల జీవితాలకు భరోసా కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం బీమా పథకాలు తీసుకురాగా.. ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 2025 జనవరి 15 వరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. దీంతో జిల్లా లీడ్‌ బ్యాంకు జిల్లాలో అన్ని బ్యాంకుల శాఖలకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించింది. ఈమేరకు సిబ్బంది ప్రత్యేకంగా గ్రామాలకు వెళ్లి ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ బీమాపై అవగాహన కల్పిస్తున్నారు. పౌరులకు సామాజిక భద్రత, కల్పించాలనే ఉద్దేశంతో అత్యల్ప ప్రీమియంతో ప్రధాన్‌ మంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధాన్‌ మంత్రి జీవన జ్యోతి యోజన (పీఎంజీజేబీవై)ను అమలు చేస్తుంది. బ్యాంకు ఖాతా ఉన్న వారంతా బీమా సౌకర్యం పొందవచ్చు. అన్ని అర్హతలు ఉన్నా.. బీమా చేయించుకోనివారు అధికంగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం అందరిని పాలసీలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో జన సురక్ష పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ప్రీమియం రూ.20 చెల్లింపుతో..

ఏదైనా ప్రమాదంలో వ్యక్తి వైకల్యం పొందినా సంబంధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రధాన్‌ మంత్రి సురక్షా బీమా యోజనను కేంద్రం అమలులోకి తీసుకువచ్చింది. వార్షిక ప్రీమియం రూ.20 తో రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు. బ్యాంకు లేదా పోస్టు ఆఫీసులో ఖాతా ఉండి 18 నుంచి 70 ఏళ్ల లోపు వయస్సు వారు ఈ బీమా పాలసీని పొందడానికి అర్హులు. ఏటా జూన్‌ 1న ప్రీమియం మొత్తం ఆటో డెబిట్‌ ద్వారా పునరుద్ధరిస్తారు. ప్రమాదవశాత్తు పాలసీదారుడు మరణించినా, శాశ్వత వైకల్యం పొందినా రూ.2 లక్షలు పాక్షిక వైకల్యానికి గురైతే రూ. లక్ష పరిహారం అందుతోంది.

రూ.36 ప్రీమియంతో జీవన్‌జ్యోతి

ఏడాదికి రూ.436తో రూ.2 లక్షల బీమా వర్తించే విధంగా పాలసీని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. బ్యాంకు ఖాతా ఉండి 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ టర్మ్‌ పాలసీని తీసుకోవడానికి అర్హులుగా గుర్తించింది. కుటుంబానికి ఆధారమైనా వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా చతికిలపడిపోతుంది. అదే జీవిత బీమా ఉంటే కొంత వరకైనా ఆర్థిక తోడ్పాటు అందుతుంది. కొంత వరకై నా ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడవచ్చుననే ప్రత్యేక కార్యక్రమాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం



మద్దూరులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్‌ సిక్తాపట్నాయక్‌

మద్దూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని, యాప్‌లోని అన్ని వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ సర్వే సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పెదిరిపాడ్‌ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో ఏమైన అనుమానాలు వస్తే ఉన్నతాధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అలాగే దరఖాస్తుదారుల నుంచి అన్ని వివరాలను క్షుణ్ణంగా సేకరించాలని ఆదేశించారు. వలస వెళ్లిన వారికి ముందస్తు సమాచారం ఇవ్వడం గానీ, ముందు రోజు టాంటాం వేయించడం చేయాలని సూచించారు. సర్వర్‌ సమస్యను కలెక్టర్‌ దృష్టికి తీసుకురాగా ప్రతిరోజు సర్వర్‌ సమస్య ఉండదని ఉదయం, సాయంత్రం వేళ్లల్లో అప్‌లోడ్‌ చేయాలని తెలియజేశారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే తప్పని సరిగా యాప్‌లో ఎంట్రి చేయాలని సూచించారు. మద్దూరు కొంత మంది మహిళలు ఎన్నో ఏళ్లగా అద్దెకు ఉంటున్నామని మాకు స్థలాలకు కూడా లేవని కలెక్టర్‌ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వం మీ లాంటి వారికి ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టే ఆలోచనలో ఉందని తెలియజేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్‌ వంట ఏజెన్సీ మహిళలకు, కేజీబీవీ ఎస్‌ఓ గౌరమ్మకు ఆదేశించారు. పెదిరిపాడ్‌లోని కేజీబీవీ పాఠశాలను కలెక్టర్‌ ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం మెనూ ప్రకారం బెండకాయ కర్రీ బదులుగా టమాటా కర్రీ చేయడాన్ని కలెక్టర్‌ తప్పుపట్టారు. వండిన భోజనాన్ని ఇద్దరు ఉపాధ్యాయులు, మెస్‌ కమిటీ సభ్యులు రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలన్నారు. విద్యార్థులకు వండిన ఆహారాన్ని ఆమె భుజించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకొని కష్టపడి చదువాలని విద్యార్థులకు కలెక్టర్‌ సూచించారు. కేజీబీవీలో ఆర్వో ప్లాంట్‌ రిపేరు, ట్రాన్స్‌పార్మర్‌ ఏర్పాటు, బోరు మోటారు నీళ్లను పరిక్ష, వంటి పనులను వెంటనే చేపట్టాలని తహసీల్దార్‌ మహేష్‌గౌడ్‌కు ఆదేశించారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన

నారాయణపేట: జిల్లా కేంద్రం శివారులోని పలు ప్రభుత్వ స్థలాలను కలెక్టర్‌ సిక్తా పటాన్నయక్‌ బుధవారం పరిశీలించారు. నారాయణపేట కొండారెడ్డి పల్లి చెరువు మార్గంలోని 104 సర్వే నంబర్‌ లో గల దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేంద్రియ విద్యాలయం నిర్మాణం కోసం పరిశీలించారు. అలాగే సింగారం వద్ద నూతన కలెక్టరేట్‌ వెనక వైపు గల 31 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ మొగులప్ప, ఆర్డీవో రామచంద్రనాయక్‌, అడిషనల్‌ డీఆర్డీఓ అంజయ్య, తహసిల్దార్‌ అమరేంద్ర కృష్ణ, రెవిన్యూ అధికారులు ఉన్నారు.

ఎకో టూరిజం పార్కు మరింత అభివృద్ధి



సోమశిల సమీపంలోని ఎకో టూరిజం పార్కును పరిశీలిస్తున్న అటవీశాఖ చీఫ్‌ కన్జర్వేటర్‌ సువర్ణ

కొల్లాపూర్‌ రూరల్‌/పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్‌ మండలం సోమశిల సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న ఎకో టూరిజం పార్కును మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌ సువర్ణ అన్నారు. బుధవారం అటవీశాఖ అధికారులతో కలిసి ఎకో టూరిజం పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో చేపట్టిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సోమశిల కృష్ణానది తీరంలో ఎకో టూరిజం కింద అనేక అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అదే విధంగా నేషనల్‌ హైవే ప్రాజెక్టుతో పాటు సోమశిల – సిద్దేశ్వరం మధ్య కృష్ణానదిపై కేబుల్‌ బ్రిడ్జి ప్రతిపాదనలు అటవీశాఖకు అందినట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలకు అనుసంధానంగా అటవీ ప్రాంతం పరిధి ఉందని.. ఆయా ప్రతిపాదనలపై అవసరమైన చర్యలు చేపడతామన్నారు. సోమశిలలో ఎకో టూరిజం ప్రాజెక్టులో భాగంగా సఫారి రివర్‌ బోటు ఏర్పాటు చేశామన్నారు. నల్లమలలో పర్యాటకులు చూడాల్సిన ప్రాంతాలు అనేకం ఉన్నాయని.. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎకో పార్కులో కల్పించాల్సిన వసతులపై ఆరా తీశారు. ప్రధాన రహదారి నుంచి పార్కు పైభాగం వరకు సీసీరోడ్డు నిర్మిస్తామని తెలిపారు. త్వరలోనే పర్యాటకులకు పార్కును అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం సోమశిలలో అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బాచారం అటవీ భూముల పరిశీలన..

పెద్దకొత్తపల్లి మండలం బాచారం సమీపంలోని అటవీ భూములను అటవీశాఖ ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌ సువర్ణ పరిశీలించారు. అమ్రాబాద్‌ పులుల అభయారణ్యంలోని కొల్లంపెంట, తార్లపల్లి, కుండిచింతల, బైలుతాటి గుండాలపెంట, వటువర్లపల్లి గ్రామాల ప్రజలను బాచారం సమీపంలోని నేషనల్‌ హైవే–167 పక్కన ఉన్న 6వేల ఎకరాల మైదాన ప్రాంతానికి (అటవీ భూమి) తరలింపునకు సంబంధిత అధికారులు చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించే ప్రాంతాన్ని ఆమె పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నల్లమల అభయారణ్యంలోని చెంచులు మైదాన ప్రాంతానికి తరలిరావడానికి సుముఖంగా ఉన్నారని తెలిపారు. ఇక్కడికి వచ్చే ఆయా గ్రామాల ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలోఎఫ్‌డీపీటీ రాంబాబు, డీఎఫ్‌ఓ రోహిత్‌, ఎఫ్‌డీఓలు తిరుమల్‌రావు, రామ్మోహన్‌, ఫారెస్టు రేంజర్‌లు చంద్రశేఖర్‌, ఈశ్వర్‌, సాతాపూర్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ వెంకటేష్‌, ముజీబ్‌, జయదేవ్‌ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

- ఎస్పీ యోగేష్‌ గౌతమ్‌
- వివిధ గ్రామాల్లో 51 సీసీ కెమెరాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌ గౌతమ్‌, చిత్రంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి

నారాయణపేట: నేరాలను నియంత్రించడం.. నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఇక పల్లెలు సైతం ఒక్కొక్కటి సీసీ నిఘా నీడలో ఉండబోతున్నాయని ఎస్పీ యోగేష్‌ గౌతమ్‌ అన్నారు. నారాయణపేట రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని వివిధ గ్రామాలలో రూ 8 లక్షలతో జాజాపూర్‌లో 26 సీసీ కెమెరాలు, పోలీసు స్టేషన్‌లో 3, కొల్లంపల్లిలో 11, చిన్న జట్రంలో 5, అప్పిరెడ్డిపల్లిలో 6 సీసీ కెమెరాలను డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సదాశివరెడ్డి, ఆయా గ్రామాల గ్రామ పెద్దలతో కలిసి బుధవారం సాయంత్రం రూరల్‌ పోలీస్‌ స్టేషన్లో ఎస్పీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలను కోరారు. వీటి వల్ల గ్రామానికి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చినా తెలుస్తుందని, గ్రామంలో ఎలాంటి అలజడి జరిగిన వెంటనే పోలీసులు చేరుకుని నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లోని సీసీ కెమెరాలు జీపీఎస్‌ కనెక్ట్‌ చేయడం వల్ల జిల్లా, హైదరాబాద్‌ కమాండ్‌ కంట్రోల్‌కి అనుసంధానం చేసి వీక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. పట్టణ, మండల, అన్ని గ్రామాల ప్రజలు, వ్యాపారులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని.. వీటి ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలు నివారించేందుకు అవకాశం, అసాంఘిక కార్యక్రమాలు నిర్మూలించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన సమయంలో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి వీలు ఉంటుందని తెలిపారు.

ప్రజలు భాగస్వామ్యం కావాలి

డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌ రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో నేరాలు అదుపు చేయడానికి పోలీసులతోపాటు ప్రజలను భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం మంచి ఆలోచన అని అన్నారు.తీసుకురావడంతో ఎస్పీని అభినందిస్తున్నామన్నారు. ఇలాగే జిల్లాలో నేరాల నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, అందుకు పోలీసులకు సహకరించాలని అన్ని గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐ శివ శంకర్‌, ఎస్‌ఐ లు రాముడు, వెంకటేశ్వర్లు,వివిధ గ్రామాల నాయకులు గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం : సీపీఎం

వీపనగండ్ల: ప్రజా ఉద్యమాలను సమష్టిగా నిర్వహించడంతో రైతులు, కార్మికులు, పేదల సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్‌ అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని గోవర్ధనగిరిలో మూడురోజులుగా కొనసాగిస్తున్న రిలే దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మొత్తం రూ.15 లక్షలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కేటాయించాలని కోరారు. మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తెల్ల కందులు క్వింటా రూ.9,951

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌ యార్డులో తెల్ల కందులు క్వింటాకు గరిష్టంగా రూ.9,951, కనిష్టంగా రూ.8,259, ఎర్ర కందులు గరిష్టంగా రూ.9,055, కనిష్టంగా రూ.7,922 ధర పలికాయి. అలాగే, వడ్లు సోనా గరిష్టంగా రూ.2,659, కనిష్టంగా రూ. 2,240, వడ్లు హంస గరిష్టంగా రూ.2,400, కనిష్టంగా రూ. 1,920 ధర పలికింది.

బాదేపల్లి మార్కెట్‌లో..

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌ యార్డులో బుధవారం కందులు క్వింటాల్‌ గరిష్టంగా రూ.7,999, కనిష్టంగా రూ.5,666 ధరలు లభించాయి. వేరుశనగ గరిష్టంగా రూ.6,764, కనిష్టంగా రూ.3,052, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,471, కనిష్టంగా రూ.2,435, ధాన్యం హంస గరిష్టంగా రూ.2,221, కనిష్టంగా రూ.1,629, ఆర్‌ఎన్‌ఆర్‌ గరిష్టంగా రూ.2,693, కనిష్టంగా రూ.1,686, పత్తి గరిష్టంగా రూ.6,739, కనిష్టంగా 5,489 ధర పలికాయి.



నిర్లక్ష్యం చేయొద్దు.. జాగ్రత్తలు తీసుకోవాలి

- డా.యశ్వంత్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జిల్లా జనరల్ ఆస్పత్రి



చలిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. గొంతునొప్పి, చలి జ్వరం, ఆస్తమా, బ్రాంకైటీస్, నిమోనియా వ్యాపిస్తాయి. దుమ్ము నోట్లోకి చేరడం వల్ల పలు రకాల ఇన్‌ఫెక్షన్స్ వస్తుంటాయి. గాలిలో చల్లని తేమ వల్ల చిన్నారులకు త్వరగా జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. ఉష్ణోగ్రత్తలు తగ్గుతున్న సమయంలో ఇంట్లో వేడి పదార్థాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. చలి తీవ్రతతో వృద్ధుల్లో చేతులు వంకర పోవడం వంటి లక్షణాలు ఏర్పడి మరణిస్తారు. దీన్నే ప్రాస్ట్‌బైట్ అంటారు. వృద్ధుల్లో శరీరానికి కావాల్సిన ఉష్ణోగ్రతలు ఉత్పత్తి కాకపోవడంతో మరణాలు సంభవిస్తాయి. దీన్ని వైద్య పరిభాషలో హైపోథెరమి అంటారు. పొడి చర్మం కలిగిన వారిలో దురదలు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. గొంతు ఇన్‌ఫెక్షన్, కీళ్ల నొప్పులు పెరుగుతాయి. కొందరిలో తలనొప్పి వస్తుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. కొంత మందిలో చలి కాలంలో కూడా పొక్కులు వస్తాయి. దీన్ని పాలీమార్ఫస్‌లైట్ ఎరప్షన్ అంటారు. ఎక్కువ సమయం నీళ్లలో చేతులను ఉంచి పనులు చేయడం వల్ల చేతిపై ఉండే నూనె పొర తొలగిపోతుంది. నూనె పొరను కాపాడుకునేందుకు ప్రయత్నించాలి.

- పాలమూరు



ఆస్తమా ప్రమాదకరం..

- డా.సందీప్, పల్మానాలజిస్ట్



ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో ఎక్కువ మంది అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. చలికాలంలో వాయుకాలుష్యం వల్ల ఆస్తమా సోకుతుంది. ఊపిరితిత్తులలో గాలి చేరడాన్ని అడ్డుకొని శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. ఒక్కోసారి ప్రాణం పోయిందనిపిస్తోంది. దీంతో పిల్లికూతలు, దగ్గు, ఆయాసం, చాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాతావరణంలో వచ్చే మార్పులు ఆస్తమా వ్యాధిగ్రస్తులను మరింత ఇబ్బందులకు గురిచేస్తాయి. పెద్దలతో పాటు పిల్లల్లోనూ జలుబు, దగ్గు, గొంతు సమస్యలు వస్తాయి. అల్ప ఉష్ణోగ్రతలను తట్టుకునేలా శరీరంలో వేడి ఉత్పత్తి అయ్యేందుకు జీర్ణవ్యవస్థ నిరంతరం పనిచేస్తుండాలి. ఇందుకోసం పీచు ఎక్కువగా ఉండే ఆహారం, తృణధాన్యాలు తీసుకోవాలి. పిల్లలకు ప్రొటీన్లు అధికంగా లభించే కోడిగుడ్లు తదితర పదార్థాలను అందజేయాలి. అప్పుడే శరీరంలో ఉష్ణోగ్రతలు సమతూకంలో ఉంటాయి. రోగనిరోధక శక్తికి నష్టం కలగకుండా చూసుకోవాలి. కేవలం ఆకుకూరలు, కూరగాయలే కాకుండా మూలికలు, సుగంధ ద్రవ్యాలను కూడా తీసుకోవాలి. మధుమేహం, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారు, పెద్ద వయస్కులు వారు ఉదయం వేళ నడకకు వెళ్లవద్దు. వీరు సాయంత్రం 4నుంచి 5గంటల మధ్య నడకకు వెళ్తే బాగుంటుంది. దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారు ఉదయం 8 గంటల వరకు బయటికి రావద్దు. చలికాలంలో వ్యాయామానికి బద్ధకించవద్దు. కనీసం 20 నిమిషాలైనా కసరత్తు చేయాలి.

- పాలమూరు

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డాకుల: మండలంలోని కాటవరం శివారులో జాతీయ రహదారి పక్కన సుమారు 35 నంచి 40 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైనట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మూడు, నాలుగు రోజుల క్రితం చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై కేవలం బూడిద రంగు నైట్ ప్యాట్ మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఠాణాలో సంప్రదించాలని కోరారు.

గద్వాలలో మరో వ్యక్తి మృతదేహం..

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించామని.. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 40 ఉంటుందని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పతి మార్చురీలో భద్రపర్చామని.. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి



తేజ (ఫైల్)

మల్దకల్: గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన వీరన్న – సుజాత కుమారుడు తేజ (6)చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఏఎస్ఐ ఈశ్వరయ్య వివరాల మేరకు.. సంగాలకు వీరన్న, అతడి భార్య సుజాత, కుమారుడు తేజతో కలిసి మోటారు సైకిల్‌పై మంగళవారం మల్దకల్ జాతరకు వెళ్లారు. జాతర ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మల్దకల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అయిజ నుంచి గద్వాలకు వస్తున్న కారు వేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. కర్నూలులో చికిత్స పొందుతూ తేజ మృతి చెందాడు. కారు డ్రైవర్ పరుశరాముడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం



అయిజ: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ చెరువులో బోల్తా పడిన ఘటన మండలంలోని చిన్న తాండ్రపాడులో బుధవారం చోటు చేసుకుంది. చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన రైతు భానుగౌడ్ తన ట్రాక్టర్‌ను పంట పొలానికి తీసుకెళ్తుండగా అదుపు తప్పి గ్రామ సమీపంలోని లింగమ్మ చెరువులో పడింది. ట్రాక్టర్ నడుపుతున్న భానుగౌడ్ అప్రమత్తమై ట్రాక్టర్ నుంచి కిందికి దూకడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

పని కోసం వెళ్లి.. శవమైన యువకుడు



పోల్‌శెట్టి శ్రీను (ఫైల్)

ఖిల్లాఘనపురం: తాపిమేస్త్రీ పనికోసం వెళ్లిన ఓ యువకుడు మూడు రోజుల తర్వాత శవమై గ్రామానికి వచ్చిన ఘటన ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పోల్‌శెట్టి చిన్న చెన్నయ్య, వెంకటమ్మల రెండవ కుమారుడు శ్రీను (33) సోమవారం మేస్త్రీ పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి టీవీఎస్‌పై బయలుదేరాడు. మంగళవారం ఉదయం నాటికి అతడు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు.. తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికారు. ఇదిలా ఉండగా.. భూత్పూర్ మండలం పాత మొల్గర వాగు వద్ద మూడు రోజులుగా టీవీఎస్ వాహనం ఆగి ఉండటం.. అక్కడ బట్టలు ఉండటంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు బుధవారం అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని టీవీఎస్ నంబర్ ఆధారంగా ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పోల్‌శెట్టి శ్రీను వాహనంగా గుర్తించి, ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సురేష్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో మొల్గరకు చేరుకొని వాగులో గాలించారు. నీటిలో చేపల వల కాళ్లకు చుట్టుకుని శ్రీను చనిపోయి కనిపించాడు. చేపలు పట్టేందుకు వెళ్లి మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హైవేపై దారి దోపిడీ



పెబ్బేరు పట్టణ శివారులోని జాతీయ రహదారి 44పై దారి దోపిడీకి గురైన కారు ఇదే..

కత్తులు, రాళ్లతో దాడి చేసిన దుండగులు

- 14 తులాల బంగారు నగలు చోరీ
- నలుగురికి గాయాలు.. బాధితులు జగిత్యాల వాసులుగా గుర్తింపు
- వనపర్తి జిల్లా పెబ్బేరు శివారులో సంఘటన
- ఐదు బృందాలతో విచారణ

వనపర్తి: గుర్తు తెలియని ఐదుగురు దుండగులు రోడ్డుపక్కన ఆగి ఉన్న యాత్రికుల వాహనంపై దాడిచేసిన సంఘటన బుధవారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులో 44వ నంబర్ జాతీయరహదారిపై చోటు చేసుకుంది. బాధితులు, డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం తీర్థయాత్రలకు తిరుపతి, అరుణాచలం, కంచి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం తెల్లవారుజామున పెబ్బేరు పట్టణ శివారులోని ఎంవీఐ కార్యాలయం ఎదుట ఎడమ వైపు ట్రక్ పార్కింగ్ వద్ద వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకున్నారు. వారు గాఢనిద్రలో ఉండగా.. గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు స్వెట్టర్లు, మాస్కులు ధరించి రాళ్లు, కత్తులతో దాడి చేశారు. కారులో ఉన్న వారు వాహనాన్ని స్టార్ట్ చేసి వెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ.. దుండగులు ఆ వాహనం వెనక టైర్‌కు అడ్డంగా పెద్దరాళ్లు పెట్టడంతో సాధ్యం కాలేదు. రోడ్డుకు కుడి వైపు ఉన్న టాయిలెట్స్ శుభ్రం చేసే వ్యక్తి.. గదిలో నిద్రిస్తున్నట్లు గమనించిన దుండగులు దాడి చేసే సమయంలో నిద్ర లేచే అవకాశం ఉందని అతను బయటికి రాకుండా గదికి గడియపెట్టారు. కారుపై ఉంచిన యాత్రికుల వస్తువులు, బ్యాగులను ఎత్తుకెళ్లడంతో పాటు కారులోని మహిళల మెడల్లో ఉన్న బంగారం గొలుసులను బలవంతం లాక్కున్నారు. కారులో మొత్తం ఎనిమిది మంది ఉండగా.. వారిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవర్ ప్రణీత్‌పై రాళ్లు, కత్తితో దాడి చేయగా అతను అక్కడే స్పృహ కోల్పోయాడు. మిగతా వారు దాడి చేసే వారిని ప్రతిఘటించే ప్రయత్నం చేసినా.. వారు రాళ్లతో దాడి చేయడంతో అడ్డుకోలేకపోయారు. మహిళల వంటిపై ఉన్న సుమారు 14 తులాల బంగారునగలను అపహరించుకుని వెళ్లారు. బాధితులు 100కు డయల్ చేయటంతో అక్కడికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌కు రప్పించి గాయాల పాలైన వారిని వనపర్తి జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. జీజీహెచ్‌లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో సంతోష్, రాజేశ్వర్‌తో పాటు డ్రైవర్ ప్రణీత్, బాలుడు శ్రీకాంత్ ఉన్నారు. మహిళలు సునీత, సరస్వతి, రజినిల మెడల్లోని గొలుసులను బలంగా లాగటంతో వారికి మెడ భాగంలో స్వల్ప రక్తగాయాలయ్యాయి.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రావుల గిరిధర్

విషయం తెలుసుకున్న ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ రాంబాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.వాహనంలో పడి ఉన్న రాళ్లు, సంఘటన స్థలంలో పడేసిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి సీఐ రాంబాబు నేతృత్వంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్లపైకి ఆర్డీఎస్ నీరు


- కోతకు గురైన డీ–30 కాల్వ

మానవపాడు: ఆర్డీఎస్ కాల్వ కోతకు గురై నారాయణపురం గ్రామంలో బుధవారం రోడ్లపై ఆ నీరు ప్రవహిస్తోంది. మండలంలోని నారాయణపురం గుండా డీ–30 కాల్వ వెళ్తుంది. కాల్వలో పూడిక తీయకపోవడంతో నీరు ఎక్కువై గ్రామంలో ప్రవహిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



నారాయణపురం గ్రామంలో ప్రవహిస్తున్న ఆర్డీఎస్ కాల్వ నీరు.

చిన్నరాజమూర్‌కి పోటెత్తిన భక్తులు



దేవాలయ ప్రధాన ద్వారంవద్ద భక్తులు

ప్రత్యేక అలంకారంలో ఆంజనేయ స్వామి

- దాసంగాలతో నైవేద్యాల సమర్పణ


దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి దాసంగాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. పలువురు భక్తులు ఆవులను, కోడేలను ఆలయానికి అందజేశారు. పోర్లు దండాలు, గండజ్యోతులతో ప్రదక్షిణలు చేశారు. కోనేరు వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. నీటిలోకి వెళ్లకుండా ప్రత్యేకంగా ఇనుప జాలీలతో కంచెను ఏర్పాటుచేశారు. దేవస్థానం వారు పులిహోర, లడ్డు ప్రసాదాలను విక్రయించారు. జాతరలో స్వీట్లు షాపులు, గాజులు, బొమ్మల షాపులు వెలిశాయి. జోరుగా వ్యాపారాలు కొనసాగాయి. రెండు వారాలు జాతర కొనసాగే అవకాశముంది. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అంజన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పూజారులు

మూడు ఇళ్లలో చోరీ

- బంగారు, వెండి వస్తువుల అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని విలియం కొండతండాలో బుధవారం రాత్రి మూడు ఇళ్లలో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. తండాకు చెందిన ముడావత్ రవి నాయక్, రాత్లావత్ రాజు, రాత్లావత్ బాబు ఇళ్లకు తాళాలు వేసి హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. బుధవారం ఉదయం పక్కింటి వారు తాళాలు తీసి ఉండటం గమనించి ఆయా ఇళ్ల వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న వారు ఇళ్లలోకి వెళ్లి చూడగా బీరువాల తలుపులు పగులగొట్టి ఉండటం.. అందులోని బంగారు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో మంగళవారం రాత్రి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి పరిశీలించి జిల్లాకేంద్రం నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

రాష్ట్రంలోకి కర్ణాటక వరి ధాన్యం?

మాగనూర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి కర్ణాటకలోని బద్దేపల్లి, అజిలాపూర్, దుప్పలి, ఇడ్లూరు తదితర గ్రామాల నుంచి నిత్యం ట్రాక్టర్లలో వరి ధాన్యం వస్తోందని.. వారికి కార్యాలయంలోని ఓ అధికారి సహకరిస్తున్నారని మండల ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఇక్కడి గన్నీ బ్యాగులను కర్ణాటకకు పంపించి గుట్టు చప్పుడు కాకుండా తీసుకొస్తున్నారని తెలుస్తోంది. మండలంలోని తాళంకేరి దగ్గర చెక్ పోస్టు లేకపోవడంతో ఇదే అదునుగా భావించి ధాన్యాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. కర్ణాటక కంటే ఇక్కడ ధర అధికంగా ఉండటం.. అదనంగా బోనస్ వస్తుండటంతో ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి పోలప్ప వద్ద ప్రస్తావించగా కర్ణాటక నుంచి వరి ధాన్యం వస్తున్నట్లు తమ దృష్టికి బుధవారం వచ్చిందని.. ఈ విషయంపై దృష్టి సారించామని, అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా

నాగర్‌కర్నూల్ క్రైం: తనకు న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేసిన ఘటన జిల్లాకేంద్రంలోని రాంనగర్‌కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన ప్రవీణ్, నూర్జహాన్ చాలారోజులుగా ప్రేమించుకుంటున్నారు. వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో ఆమె షీటీంను ఆశ్రయించింది. షీటీం ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపించగా ఇటీవలే విడుదలయ్యాడు. తాజాగా బుధవారం నూర్జహాన్ ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు కోర్టులో ఉందని తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని సముదాయించి పంపించారు.

రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలి



ఫుట్‌బాల్ విన్నర్, రన్నర్ జట్లతో అధికారులు, పీడీలు

- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్‌పీ.వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలు బుధవారం మూడోరోజుకు కొనసాగాయి. ఆర్చరీ, ఫుట్‌బాల్, తైక్వాండో, కరాటే పోటీలు, ఎంపికలు నిర్వహించారు. ఫుట్‌బాల్ పోటీలకు వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

జాతీయస్థాయికి ఎదగాలి

జిల్లా క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎదగాలని పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో సీఎం కప్ జిల్లాస్థాయి కరాటే ఎంపికలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో టీజీ పీడీ, పీఈటీల సంఘం అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి విలియం, పీడీలు వేణుగోపాల్, నిరంజన్‌రావు, వడెన్న, పరశురాం, భానుకిరణ్, మొగులాల్, కృష్ణ, ఉమాదేవి, అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగియనున్న జిల్లాస్థాయి క్రీడలు

సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలు గురువారం ముగియనున్నాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, బాక్సింగ్ క్రీడలతోపాటు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. సాయంత్రం ముగింపు వేడుకలు నిర్వహించి విజేత జట్లకు ట్రోఫీలు అందజేయనున్నారు.

కరాటే ఎంపికల వివరాలు

జిల్లాస్థాయి కరాటే ఎంపికల్లో 14–15 ఏళ్ల విభాగం – 52కేజీలో శివప్రసాద్, –57కేజీలో శ్రీకర్‌రెడ్డి, –63కేజీలో విశాల్, 63కేజీలో తేజవర్ధన్, 47కేజీలో షాఫియా తస్లీం, 54కేజీలో గాయత్రి, 54కేజీలో వైష్ణవి.

- సీనియర్–18 ఏళ్లపైబడి విభాగం 55కేజీలో ఎండి.అర్షి జమీల్, 60కేజీలో మొయినోద్దీన్, 75కేజీలో లక్ష్మణ్, +75కేజీలో హుజేఫ్ షరీఫ్, –55కేజీలో డి.వీణ,
- జూనియర్ 16–17 ఏళ్ల విభాగం 55కేజీలో అభిలాష్, 61కేజీలో బాలే షరీఫ్, 63కేజీలో చందు, 53కేజీలో మహిమాన్విత, 59కేజీలో ఐశా తస్లీంలు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు క్రిష్ణయ్య, తాజుద్దీన్, ఇలియాజ్, శంకర్‌నాయక్, సాలం బిన్ ఉమర్, శివకుమార్, నవీన్‌కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత మహబూబ్‌నగర్

జిల్లాస్థాయి సీఎం కప్ ఫుట్‌బాల్ సీనియర్ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 2–1 గోల్స్ తేడాతో జడ్చర్లపై జట్టుపై విజయం సాధించింది. బాలికల విభాగంలో జడ్చర్ల జట్టు 2–0 గోల్స్‌తో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది.

ఆర్చరీ ఫలితాలు

ఆర్చరీ బాలుర కాంపౌండ్‌లో ఎన్.విష్ణువర్ధన్, బాలికల్లో ఆర్.సుజాత, ఇండియన్ రౌండ్ బాలురలో రామావత్ రవి, బాలికల్లో కె.సునీత విజేతలుగా నిలిచారు.

దిగి వచ్చిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ.3,610.. కనిష్టంగా రూ.1,700



విక్రయానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన ఉల్లి వేలంలో ధరలు తగ్గుముఖం పట్టాయి. నాలుగు వారాలుగా పెరిగిన ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. కర్ణాటక, మహారాష్ట్రా నుంచి హైదరాబాద్, కర్నూలు ప్రాంతాలకు ఉల్లి దిగుమతి కావడంతో ధరలు తగ్గాయి. గత వారం గరిష్టంగా రూ.5,100 వరకు ఉండగా.. ఈ వారం రూ.3,610 పలికింది. అంటే ఏకంగా రూ.1,500 వరకు తగ్గింది. కనిష్టంగా రూ.1,700 ధర నమోదైంది. గత వారం కనిష్టంగా రూ.3,100 ధర ఉండగా.. సుమారు రూ.1,400 వరకు తగ్గింది. 45 కిలోల బస్తా గరిష్టంగా రూ.1,800, కనిష్టంగా రూ.850కి విక్రయించారు.

శ్రీశైలం జలాశయంలోకి 7,870 క్యూసెక్కులు పంపింగ్

దోమలపెంట: భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతి ద్వారా 24 గంటల వ్యవధిలో సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి 7,870 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేశారు. జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,695, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బుధవారం శ్రీశైలం జలాశయంలో 863.4 అడుగుల వద్ద 116.6364 టీఎంసీల నీటినిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు.

క్లుప్తంగా

నేడు ఆయిల్‌పాం సాగుపై శిక్షణ

మద్దూరు/కొత్తపల్లి: జిల్లాలో ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు, నూతనంగా ఆయిల్ పాం సాగు చేయాలనే వారికి బుధవారం మండలంలోని నిడ్జింతలో లక్ష్మీనారాయణరెడ్డి ఆయిల్‌పాం క్షేత్రంలో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి టీజీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జీఎం సుధాకర్‌రెడ్డి, హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు హాజరుకావాలని సూచించారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



మాగనూర్: మండలంలోని అమ్మపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం శ్రీనివాసులు ఏకరూప దుస్తులు, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ఉచితంగా రెండు జతల దుస్తులను అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సలాభాయి, గ్రామస్తులు నర్సింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎక్కామేడ్‌లో టీబీ సర్వే



కొత్తపల్లి: మండలంలోని ఎక్కామేడ్‌లో బుధవారం వైద్య సిబ్బంది టీబీ సర్వే నిర్వహించారు. టీబీ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా కొమ్మూర్ సబ్‌సెంటర్ పరిధిలోని ఎక్కామేడ్‌లో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో టీబీ, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేశారు. ప్రధాని మోదీ చేపట్టిన టీబీ రహిత భారత్ కార్యక్రమానికి సహకరించాలని వైద్య సిబ్బంది కోరారు. కార్యక్రమంలో వైద్య అధికారి రోహిణి, ల్యాబ్ టెక్నీషియన్ నీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చురుకుగా సాగుతున్న రోడ్డు పనులు



కొత్తపల్లి: మద్దూరు, లింగాల్ చేడ్ బీటీరోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా 15.08 కిలో మీటర్ల దూరానికి రూ. 39కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు పనులు బుధవారం ప్రారంభించారు. పనులు వేగంగా కొనసాగుతుండడంపై వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

మక్తల్: మండలంలోని జక్లేర్ శివారు సమీపంలోని పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకుని టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ సంఘటనలో వారి వద్ద 7 బైకులు, 4 సెల్‌ఫోన్లు, రూ. 3,740 నగదును స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

'కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'



మక్తల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పృద్వీరాజ్ అన్నారు. పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అమిత్‌షా చేసిన వాఖ్యలను నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ను కించపరిచేవిధంగా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. నాయకులు పృద్వీరాజ్, వెంకటేష్, సురేష్, మద్దిలేటి, రవికుమార్, అక్షయ్, శ్రీహరి, తేజవర్ధన్, రమేష్, ప్రవీణ్, రాఘవేందర్, తిమ్మరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం తగదు

మరికల్: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగం రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అవమానించడం తగదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే అమిత్‌షా కేంద్ర హోం మంత్రి అయిన విషయం మర్చిపోయారని విమర్శించారు. అంబేడ్కర్ రాజ్యాంగానికి బీజేపీ వ్యతిరేకమని నిరూపితమైందన్నారు.

పెంపుడు జంతువులను సంరక్షించుకోండి



- ఈటె బండ ఈశ్వర్ రెడ్డి, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి

రాష్ట్రంలో రోజు రోజుకు వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం.. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరుగుతుంది.. పశువులు, పెంపుడు కుక్కలు, ఇతర జంతువులను చలి నుంచి కాపాడుకునేందుకు యాజమానులు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి ఈట బండ ఈశ్వర్ రెడ్డి సూచించారు. బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. చిన్న దూడలు, గొర్రెలు, మేక పిల్లల్లో, చలి తీవ్రత వాతావరణంలో శరీర ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయి మృత్యువాత పడతాయన్నారు. పెంపుడు జంతువులకు ఎలాంటి రోగాలు వచ్చిన వెంటనే పశువైద్యులను సంప్రదించి మందులు వేయించాలన్నారు.

- నారాయణపేట

చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి..



- డా. సతీష్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, జిల్లా ఆస్పత్రి, వనపర్తి



నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. చలికి తట్టుకోలేక చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ కాలంలో జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఉదయం, సాయంత్రం వేళలో ముక్కు, చెవులను కప్పి ఉంచేలా ఉన్ని దుస్తులు ధరించడంతో పాటు స్వెట్టర్ వేసుకోవాలి. సాధ్యమైనంత వరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి. అత్యవసరమైతే తగిన రక్షణ కవచాలను ధరించి ప్రయాణం చేయవచ్చు. ఉబ్బసం వ్యాధితో బాధపడే వారు ఆల్కహాల్, ధూమపానానికి దూరంగా ఉండటంతో పాటు ఆహార నియమాలు పాటించాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులు చలితో నిమోనియా బారినపడే ప్రమాదం ఉన్నందున బయట తిరగకపోవడం మంచిది. గోరువెచ్చని నీటిని తాగడంతో జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.

- అమరచింత

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి తదితరులు

నారాయణపేట రూరల్/ ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్రీడా పోటీలు దోహదపడతాయని జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక మినీ స్టేడియంలో మూడవరోజు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను ఎంత సానబడితే అంత మెరుస్తారని వారిని కొనియాడారు. అనంతరం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేష్ శెట్టి, తిరుపతి రెడ్డి, నర్సింహులు, వెంకటప్ప, జ్యోతి, గోపాలం, సాయినాథ్, కతలప్ప, శ్రీధర్‌గౌడ్, వెంకటేష్, రూప, శ్రీవాణి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దామరగిద్ద: మండలంలోని మొగుల్‌మడ్కలో జెడ్పీ ఉన్నత పాఠశాలను జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు.. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, వంట గదిని, బియ్యం నిల్వలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆమె వెంట డిప్యూటీ సీఈఓ జ్యోతి, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులపై నిర్లక్ష్యం వీడాలి



రోడ్డుపై నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నారాయణపేట రూరల్/ ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఉద్యోగులపై ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య విధానాన్ని విడనాడాలని వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ పార్క్ వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె ఏడవ రోజుకు చేరింది. బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి ధర్నాలో కూర్చోగా, వారికి బీఆర్ఎస్, సీపీఎం, ఎస్‌జీఎఫ్ క్రీడల సమైక్య అధికారులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాలు బాగుపడడం లేదని, వారితో వెట్టిచాకిరి చేయించుకుని చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీలు, సంఘాల నాయకులు శ్రీనివాస్, గోపాల్, వెంకట్రామిరెడ్డి, నర్సింహులు, సాయినాథ్, వెంకటప్ప, బాలరాజ్, బసంత్ రెడ్డి, ఎల్లాగౌడ్, అల్తాఫ్, రాజశేఖర్, ఆరిఫ్ అహ్మద్, నారాయణ పవర్, రవి, రాజు, మహిపాల్, అనిత పాల్గొన్నారు.

మహిళల సంరక్షణే షీటీం లక్ష్యం



మాట్లాడుతున్న సీఐ శివశంకర్

నారాయణపేట టౌన్: మహిళల సంరక్షణే షీటీంల లక్ష్యమని, ఎలాంటి సమస్యలు ఎదురైనా షీటీంకు సమాచారం అందించాలని సీఐ శివ శంకర్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలో శీల గార్డెన్‌లో ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినులకు ఎవరైనా వేదింపులకు గురిచేసిన వెంటనే జిల్లా షీటీం పోలీసులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఉన్న షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాల, పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ర్యాగింగ్, ఇవ్‌టీజింగ్, ట్రాఫిక్ తదితర వాటిపై అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షీ టీం ఎల్లవేళలా అందుబాటులో ఉండి.. ఎలాంటి వేధింపులకు గురయ్యే మహిళలు షీటీంకు ఫిర్యాదుచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు, హాజమ్మ, నారాయణ, నర్సింహ, ఎల్లప్ప, ఆశమ్మ, కృష్ణ, ఈశ్వరమ్మ, అనురాధ, జోగిని మహిళలు, హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



నారాయణపేట: రాజకీయ పార్టీలు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ.. అధికారులకు సహకరించాలని ఆర్డీఓ రాంచందర్ నాయక్ సూచించారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ముందస్తు కార్యకలాపాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు, తహసీల్దార్ అమరేందర్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ధన్వాడ: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేష్ శెట్టి అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా మండలంలోని మూడవరోజు ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు పోటీల్లో ఉత్తమ ప్రదర్శనను ఇచ్చి జాతీయ స్థాయి వరకు ఎదగాలన్నారు. ఫుట్‌బాల్ పోటీల్లో పురుషుల విభాగంలో ధన్వాడ మొదటి బహుమతి, రెండవ బహుమతి మద్దూరు మహిళ విభాగంలో పేటకు మొదటి బహుమతి దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శివకుమార్‌రెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్

ఊట్కూరు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని కొల్లూరులో రైతు వేదిక భవనంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనింటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు 4 చట్టాలు ఉన్నాయని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు విధిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. ఉచిత న్యాయస్థానాల కోసం ప్రజలు 15100కు నంబర్‌కు ఫోన్ చేయండతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ సమృద్ధి యోజన, విశ్వకర్మ యోజన తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నందిని, అడ్వకేట్ లక్ష్మీపతిగౌడ్, వీరేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



కొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం సీఎం సహాయనిధి చెక్కులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థిక సహాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ఏడు మంది లబ్ధిదారులకు రూ. 4లక్షల 20వేల చెక్కులను అందిచారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, బాల్‌రెడ్డి, వెంకటయ్య, పార్థివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్



మాగనూర్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

ఊట్కూరు: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతతో వడ్డించాలని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, బిజ్వార్ పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం విషయంపై చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. వారానికి రెండు సార్లు గుడ్లు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేంద్రకుమార్, స్వేత, హెచ్‌ఎం రవీంద్రనాయక్, అంగన్‌వాడీ టీచర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం వడ్డించాలి

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని నేరడగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు కస్తుర్బాగాంధీ బాలిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించి, నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం నేరడగంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వేను వేగవంతంగా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నర్సింహులు

కోస్గి రూరల్: బాల్యవివాహాలను నిర్మూలించడం మనందరి బాధ్యత అని మహిళ సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. బుధవారం గుండుమాల్ మండల పరిధిలోని బలుబద్రాయపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలో శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం-బాలికలను చదివిద్దాం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్య నేరమని, 18సంవత్సరాలు నిండిన అమ్మాయి, 21 సంవత్సరం అబ్బాయిలకు ఇచ్చి పెళ్లిళ్లు చేయాలని బాల్యవివాహాలు చేయడంతో పుట్టబోయే పిల్లలకు అనారోగ్యంతో ఇబ్బందులకు గురవుతారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళ సాధికారత కేంద్రం సభ్యులు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు నర్సింహులు, శివాని, విజయలక్ష్మి, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సైక్లింగ్ పోటీలు

మక్తల్: పట్టణంలోని ఈ నెల 20నుంచి సీఎం కప్ సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకటేష్ శెట్టి బుధవారం విలేకరులకు తెలియజేశారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు తమపేర్లు ఇతర వివరాలు నమోదుచేసుకోవాలన్నారు. వారికే పోటీలకు అనుమతి ఉంటుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 27నుంచి 29వరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో జరిగే సీఎం కప్ సైక్లింగ్ పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో పీడీలు విశ్రాంత పీటీ గోపాలం, సాయినాథ్, విష్ణువర్ధన్, ఈశ్వర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



బూత్‌కమిటీని ఎన్నుకుంటున్న నాయకులు

మాగనూర్: రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని ఓబ్లాపూర్, అడవిత్యావార్, మందిపల్లి, ఉజ్జెల్లి, నేరడగందొడ్డి గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీలను ఎనుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామస్థాయిలో ఈ కార్యక్రమాలు మొదలు పెట్టినట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త, నాయకులు చురుకుగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, జయనంద్‌రెడ్డి ఆయా గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ



ధన్వాడలో కలశంతో శోభయాత్రగా బయలుదేరిన అయ్యప్ప మాలధారులు

ధన్వాడ: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడిపూజ భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి విగ్రహాన్ని రథంలో ఉంచి ఆలయం నుంచి గ్రామ పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటుచేసిన 18మెట్ల పడిని ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకం చేశారు. శ్రీనివాస్‌గౌడ్, అయ్యప్ప, సురేందర్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ముగ్దంపురంలో భక్తులు ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూ జ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదా న చేపట్టారు.

అంబా భవాని ఆలయంలో

దామరగిద్ద: మండల కేంద్రంలోని అంబా భవాని ఆలయ ఆవరణలో భక్తులు మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు వివేకానంద చౌరస్తా నుంచి కలశ ఊరేగింపు, ప్రత్యేక రథంలో స్వామివారిని అలకరించి శోభయాత్ర చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భీష్మ పౌండేషన్ వ్యవస్థాపకులు రాజ్‌కుమార్ భక్తులు పాల్గొన్నారు.

నేడు 'పేట'లో బీజేపీ కార్యశాల

నారాయణపేట టౌన్: జిల్లా స్థాయి పార్టీ సంస్థాగా ఎన్నికల కార్యశాల ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని లక్ష్మి బంకెట్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు పి. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఆకట్టుకున్న ఇంద్రజాలం

కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు చేపట్టిన ఇంద్రజాలం ఎంతగానో ఆకట్టుకుందని హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఇంద్రజాలంలో తాడుతో వేసిన బంధాలను క్షణంలో విప్పడం, నోటితో తాగిన నీటిని చెవి లోనుంచి రప్పించడం, వస్త్రాలతో కాగితం పువ్వులను సృష్టించడం వంటివి మరింత ఆసక్తిని పెంచాయి. అనంతరం మెజీషియన్ వెంకట్రాములును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దిరాములు, త్రిగుణ, మల్లేషం, సంతోష్, భీమయ్య, మల్లయ్య, అహ్మద్‌పాషా పాల్గొన్నారు.

నర్వ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆంజనేయరెడ్డి

నర్వ: మండల కేంద్రం, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సద్దల ఆంజనేయరెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం సీనియర్ నాయకులు జలంధర్‌రెడ్డి ఇంటి వద్ద నిర్వహించిన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సద్దల ఆంజనేయరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొండన్న, బాలస్వామి, ఆంజనేయులు, పెద్దగొల్ల రాంచంద్రి, అయిలప్ప, రాములు, మన్యం, అంజన, చెన్నప్ప, కట్ట నర్సింహాతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా ఆంజనేయరెడ్డికి మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ నియామకపత్రాన్ని అందజేశారు.

గ్రామీణ వైద్యుల సేవలు వెలకట్టలేనివి

ఊట్కూరు: గ్రామీణ వైద్యుల సేవలు వెలకట్టలేనివని ఆదిత్యపరాశ్రీ అన్నారు. బుధవారం బిజ్వార్‌లో మెడికల్‌షాపు ప్రారంభోత్సవం చేపట్టారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో గ్రామీణ వైద్యులు వెళ్లి పేదలకు చికిత్సలు అందించడం వెలకట్టలేనివని ఆయన అన్నారు. గ్రామాల్లో సైతం మందులు రోగులకు అందుబాటులో ఉండేందుకు మెడికల్ షాపులను ప్రారంభించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు మేరువరాజు, ఆంజనేయులుగౌడ్, మహేష్‌గౌడ్, తిరపతి, కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థినినీ సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రావణి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్‌లో మొదటి బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం గణేష్‌సింగ్ తెలిపారు. బుధవారం పాఠశాలలోని ఉపాధ్యాయులు ఆ విద్యార్థినినీ సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఎయిడ్స్ కారకాలు, వ్యాప్తిని నివారించేందుకు అవలంభించాల్సిన జీవన మార్గాలు, ఆరోగ్యకరపు అలవాట్లు అనే అంశంపై పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో విద్యార్థిని మొదటి బహుమతి పొందడం తమకు, తమ గ్రామానికి గర్వంగా ఉందన్నారు. ఈ విద్యార్థినినీ ఆదర్శంగా తీసుకొని మిగితా విద్యార్థులు కూడా అన్నిరకాల పోటీల్లో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అర్జున్, తిరుమల్‌రావు, చంద్రశేఖర్, రాజన్న, నర్మద, ఆనంద, లక్ష్మీ ఉన్నారు.